




quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY తెలుగు దినపత్రిక








| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 205 | సోమవారం | 27-04- 2026 | వెల: 3 రూ./- | పేజీలు : 8 |
|---|---|---|---|---|---|---|
| MALKAJGIRI | Volume: 3 | Issue: 205 | Monday | 27-04- 2026 | Price: ₹3/- | Pages: 8 |




# క్షేత్రస్థాయికి ప్రజావాణి

- వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రారంభించాలి
- తరువాత దశలో మండల స్థాయికి విస్తరించాలి
- జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్
- ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలి
- అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలి
- ప్రజావాణి సేవల వికేంద్రీకరణతో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుదల


**హైదరాబాద్, ఏప్రిల్26 (క్విక్ టుడే న్యూస్):**
రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజున (2023 డిసెంబర్ 8వ తేదీన) ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లోప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి ఎంసీహెచ్ఆర్‌డీలో జరిగిన సమావేశంలో తెలంగాణ సీఎస్ కె.రామకృష్ణారావుతో పాటు సీఎంవో అధికారులను ఆదేశించారు. వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని చెప్పారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించాలని, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, ఆలస్యం జరగకూడదని చెప్పారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులుగా చేయాలని చెప్పారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కిందిస్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని సూచించారు.



# ట్రంప్‌పై హత్యాయత్నం

- వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పులు
- ట్రంప్ ను సురక్షిత ప్రాంతానికి తరలించిన సీక్రెట్ సర్వీస్
- అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది
- కార్యక్రమాన్ని కొనసాగించాలని సూచించిన డొనాల్డ్ ట్రంప్
- నిందితుడి ఫొటో, వీడియోను విడుదల చేసిన ట్రంప్
- అతడో మానసిక రోగిగా పేర్కొన్న అమెరికా అధ్యక్షుడు
- భద్రతా సిబ్బందిని ప్రశంసిస్తూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేసిన ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్26:**



అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హత్యాయత్నం జరిగింది. శనివారం రాత్రి వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ కార్యక్రమంలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ హాజరైన సమయంలో పెద్ద శబ్దాలు వినిపించడంతో తీవ్ర కలకలం రేగింది. దీంతో అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, ట్రంప్ దంపతులను వెంటనే తమ భద్రతా వలయంలోకి తీసుకుని అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ ఘటనతో వేదిక వద్ద ఉన్నవారంతా ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. 'కిందకు వంగండి, కిందకు వంగండి' అంటూ అరుపులు వినిపించాయి. వందలాది మంది జర్నలిస్టులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు టేబుళ్ల కింద దాక్కున్నారు. కొద్ది క్షణాల్లోనే కంబాట్ గేర్‌తో సీక్రెట్ సర్వీస్ అధికారులు డైనింగ్ హాల్‌లోకి ప్రవేశించి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా రాబర్ట్ ఎఫ్.కెన్నడీ జూనియర్, డగ్ బర్గమ్, మార్కో రూబియో వంటి పలువురు సీనియర్ అధికారులను కూడా సిబ్బంది నేలపైకి నెట్టారు. అనంతరం క్యాబినెట్ సభ్యులను ఒక్కొక్కరిగా బయటకు పంపించారు. ఈ ఘటనపై యూఎస్ సీక్రెట్ సర్వీస్ స్పందిస్తూ... ట్రంప్, మెలనియా సురక్షితంగా ఉన్నారని ధ్రువీకరించింది. కాల్పుల ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొంది. అనుమానితుడు ప్రాణాలతోనే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ట్రూత్ సోషల్'లో స్పందించారు. "సీక్రెట్ సర్వీస్, ఇతర భద్రతా బలగాలు చాలా వేగంగా, ధైర్యంగా స్పందించాయి" అని ప్రశంసించారు. షూటర్‌ను అదుపులోకి తీసుకున్నారని నిర్ధారిస్తూ.. 'లెట్ ది షో గో ఆన్' (కార్యక్రమాన్ని కొనసాగించండి) అని తాను సూచించినట్లు తెలిపారు. అయితే, భద్రతా అధికారుల నిర్ణయానికే కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ గందరగోళం కారణంగా కార్యక్రమాన్ని మరో తేదీలో నిర్వహించాల్సి రావొచ్చని పేర్కొన్నారు. కాగా, 2024 జులైలో పెన్సిల్వేనియాలో జరిగిన ప్రచార ర్యాలీలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో దుండగుడు జరిపిన కాల్పుల్లో ట్రంప్ చెవికి స్వల్ప గాయమైంది. ఈ ఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న నిందితుడి ఫోటోను, వీడియోను స్వయంగా డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' లో విడుదల చేశారు. "ఇతడే ఆ మానసిక రోగి" అంటూ ట్రంప్ చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. దాడికి పాల్పడిన వ్యక్తిని కాలిఫోర్నియాలోని టోరెన్స్‌కు చెందిన కోల్ థామస్ అలెన్ (31)గా గుర్తించారు. సీక్రెట్ సర్వీస్ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రంప్ విడుదల చేసిన చిత్రాల్లో, నిందితుడు నేలపై పడి ఉండగా, భద్రతా సిబ్బంది అతడిని చుట్టుముట్టి ఉన్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ దాడి వెనుక ఉగ్రవాద కోణం ఉందా లేక వ్యక్తిగత కారణాలున్నాయా అనే దిశగా ఎఫ్‌బీఐ, సీక్రెట్ సర్వీస్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీక్రెట్ సర్వీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు బుల్లెట్‌ప్రూఫ్ వెస్ట్ ధరించి, అత్యాధునిక ఆయుధాలతో భద్రతా వలయాన్ని ఛేదించి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, నిందితుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక సీక్రెట్ సర్వీస్ అధికారికి ఛాతీపై బుల్లెట్ తగిలింది. అయితే, అతను బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని అధికారులు తెలిపారు.

# నేడు బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



- ఊరూవాడా పార్టీ జెండాలు ఎగరేయాలి
- నేడు తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం
- వేసవి తీవ్రత దృష్ట్యా ప్లీనరీకి బదులు కార్యవర్గ సమావేశం
- ఆహ్వానం ఉన్నవారు మాత్రమే రావాలని నేతలకు కేటీఆర్ సూచన

**హైదరాబాద్, ఏప్రిల్26 (క్విక్ టుడే న్యూస్):**
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండాలు ఎగరేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు పార్టీ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయం తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాల్లో జెండా వందనం చేసి వేడుకలు జరపాలని అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. వాస్తవానికి ప్లీనరీ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, ఇటీవల జగిత్యాలలో భారీ సభ నిర్వహించడం, ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఈసారికి కార్యవర్గ సమావేశానికే పరిమితం చేస్తున్నట్లు వివరించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులకు మాత్రమే ఆహ్వానాలు పంపినట్లు పార్టీ స్పష్టం చేసింది. ఆహ్వానం ఉన్నవారు మాత్రమే తెలంగాణ భవన్‌కు రావాలని, మిగతా నాయకులు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం 2001లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించగా, 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. దేశవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికతో 2022లో పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. అయితే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానంలోనూ గెలవలేకపోయింది.



# స్వీయ జనగణన షురూ..

## సెల్ఫ్ ఎన్యుమరేషన్ లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్26 (క్విక్ టుడే న్యూస్):**
జనగణనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) లో పాల్గొని వివరాలను నమోదు చేసుకున్నారు. జనగణన 2027 లో భాగంగా తెలంగాణలో ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో స్వీయ గణన ప్రారంభమైంది. వెబ్‌సైట్‌లో ముఖ్యమంత్రి వివరాలను స్వీయ నమోదు చేసుకున్నారు. అత్యంత కీలకమైన ఈ కార్యక్రమంలో ప్రజలంతా విశేషంగా పాల్గొనాలని వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జనాభా లెక్కల కార్యక్రమంలో ముందుగా చేపట్టిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమానికి సంబంధించి సెన్సస్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జాయింట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ప్రియాంక అల, సమాచార శాఖ కమిషనర్ సీహెచ్. ప్రియాంక గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బంకుల్లో నో స్టాక్ బోర్డులు కనిపించొద్దు

## ఇంధన కొరతపై సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి, ఏప్రిల్26 (క్విక్ టుడే న్యూస్:**
పెట్రోల్, డీజిల్ విక్రయాల్లో డిమాండ్‌కి తగిన సప్లయ్ ఉండేలా చూడాలని, సోమవారంలోగా సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులను, ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన చంద్రబాబు... పెట్రోల్, డీజిల్ కొరత తలెత్తడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రిటైల్ ఔట్ లెట్ల దగ్గర వాణిజ్య వినియోగదారులు కొనుగోళ్ల వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు వివరించారు. రాష్ట్రంలో సాధారణంగా పెట్రోల్ రోజుకు 6,330 కేఎల్ అమ్మకాలు జరిగేవని, అయితే



శనివారం ఒక్కరోజే 34 శాతం డిమాండ్ పెరిగి 8,489 కేఎల్‌కు అమ్మకాలు చేరాయని, ఆదివారం సైతం సాధారణ డిమాండ్ కన్నా 22 శాతం అధికంగా 7,750 కేఎల్ వినియోగం ఉందన్నారు. మరోవైపు డీజిల్ విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. సాధారణంగా డీజిల్ రోజుకు 9,048 కేఎల్ అమ్మకాలు జరిగేవని, అయితే శనివారం 16 శాతం డిమాండ్ పెరిగి 10,556 కేఎల్‌కు అమ్మకాలు చేరాయని, ఆదివారం సాధారణ డిమాండ్ కన్నా 3 శాతం అధికంగా 9,392 కేఎల్ వినియోగం ఉందని అధికారులు చంద్రబాబుకు తెలిపారు. నయారా, రిలయన్స్, జియో వంటి ప్రైవేట్ ఆపరేటర్లు కూడా తమ కంపెనీ బంకులకు సప్లయ్ నిలిపివేయడం సమస్యను మరింత తీవ్రతరం చేశాయని జిల్లా కలెక్టర్లు వివరించారు.